క్లుప్తంగా

నేడు జాబ్ మేళా

సంగారెడ్డి టౌన్: జిల్లా ఉపాధి కార్యాలయంలో బుధవారం జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి అనిల్ కుమార్ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఫైనాన్స్ బ్యాంకులో 30 ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. నిరుద్యోగులు తమ సర్టిఫికెట్లతో జిల్లా ఉపాధి కార్యాలయంలో ఉ.10.30 గంటలకు హాజరుకావాలని తెలిపారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

ఇళ్ల మధ్యన నీరు..

జహీరాబాద్ టౌన్: భారీ వర్షాలకు మండలం పరిధి బూచినెల్లి గ్రామంలోని దళితవాడ ఇళ్ల మధ్యలోకి నీరు చేరడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. అధికారులు ఎవరూ పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఎస్సీ కాలనీ పక్కనే కుంట ఉండగా వర్షం, మురికినీరు అందులోకి చేరుతుంది. కొంతమంది కుంటను కబ్జా చేసి నిర్మాణాలు చేపట్టడం వల్ల నీరు వెళ్లేందుకు దారిలేక నివాసాల మధ్య నిలుస్తుంది. ఇళ్ల మధ్యలోకి నీరు చేరడం వల్ల పాములు, విషపురుగులు వస్తున్నాయని, పారిశుధ్య సమస్య కూడా నెలకుని దోమలు వ్యాప్తి చెందుతున్నాయని ఆరోపించారు. పంచాయతీ కార్యదర్శికి ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

జేఏసీ చైర్మన్ దీక్షకు మద్దతు


నిరసన తెలుపుతున్న నిరుద్యోగులు


సంగారెడ్డి: జిల్లా కేంద్ర గ్రంథాలయంలో విద్యార్థులు నిరుద్యోగుల జేఏసీ చైర్మన్ అశోక్ చేస్తున్న దీక్షకు మద్దతుగా మంగళవారం సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన 2 లక్షల ఉద్యోగాలు జాబ్ క్యాలెండర్ ఏమైందని నిలదీశారు. తక్షణమే విడుదల చేయాలని నిరసనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ విద్యార్థులు పెద్ద ఎత్తున్న పాల్గొన్నారు.

హరీశ్‌రావును కలిసిన నేతలు


హరీశ్‌రావును కలిసిన నాయకులు

మునిపల్లి(అందోల్): మాజీ మంత్రి హరీశ్‌రావును అందోల్ మాజీ ప్రజా ప్రతినిధులు కలిసినట్లు మాజీ ఎంపీపీ శైలజా తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ అభివృద్ధికి పలు సూచనలు చేసినట్లు చెప్పారు. పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటు స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలని హరీష్‌రావు సూచించినట్లు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు జైపాల్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ వెంకటేశం, మండల ప్రధాన కార్యదర్శి శశికుమార్, యువత మండల నాయకులు ఉన్నారు.

వట్‌పల్లిలో అలయ్ బలయ్


ఏర్పాట్లు పరిశీలిస్తున్న క్రాంతికిరణ్

వట్‌పల్లి(అందోల్): దసరా పండుగ సందర్భంగా నిర్వహించే అలయ్ బలాయ్ కార్యక్రమానికి ఏర్పాట్లు చేస్తున్నారు. మంగళవారం మండల కేంద్రం వట్‌పల్లిలోని శ్రీగురు కృప ఫంక్షన్ హాల్‌లో అలాయ్ బలాయ్ నిర్వహణ ఏర్పాట్లను క్రాంతికిరణ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబించే అలయ్ బలయ్ కార్యక్రమం ప్రతిఏటా నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమానికి మాజీ మంత్రి హరీష్‌రావు హాజరువుతారన్నారు. ఆయన వెంట బీఆర్ఎస్ పార్టీ మండల నాయకులు వీరారెడ్డి, పార్టీ ప్రధాన కార్యదర్శి శివాజీరావు, పీఏసీఎస్ డైరెక్టర్ బుద్దిరెడ్డి, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ అశోక్‌గౌడ్, మాజీ డైరెక్టర్లు మధు, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

ముగిసిన విశ్వకర్మ జయంతి వేడుకలు

జిన్నారం(పటాన్‌చెరు): బొల్లారం పట్టణ పరిధిలోని బీసీ కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ధ్యాన మందిరంలో విశ్వకర్మ జయంతి వేడుకలను ఐదు రోజుల పాటు ఘనంగా నిర్వహించారు. మంగళవారం విశేష పూజలు అందుకున్న విశ్వకర్మ భగవానుడి నిమజ్జనం అనంతరం లడ్డూను వేలంపాటు వేయగా సంఘం నాయకుడు భరత్‌చారి మనవడు జయసింహ చారి 41 వేలకు దక్కించుకున్నాడు. శ్రీశ్రీ వీరధర్మజా గురువు లడ్డూను భరత్‌చారికి అందించి ఆశ్వీదించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం ప్రారంభించారు. కార్యక్రయంలో సంఘం సభ్యులు విఠల్‌చారి. వెంకటేశ్, అశోక్, విష్ణుచారి, సంతోషి, నరసింహ, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

అధిక వర్షాలకు దెబ్బతిన్న పత్తి

- పత్తి పంటలో చీడపీడల బెడద
- దిగుబడిపై రైతుల ఆందోళన
- జిల్లాలో 3,16,171 ఎకరాల్లో సాగు


అధిక వర్షాలకు పనికి రాకుండా పోయిన పత్తి పంట

మునిపల్లి(అందోల్): ఈసారి అధిక వర్షాలు పడుతుండటంతో పత్తి పంట దెబ్బతింటుంది. తరచూ వర్షం కురుస్తుండటంతో చీడపీడల బెడద ఎక్కువ అవుతోంది. నివారణకు వివిధ రకాల మందులు పిచికారీ చేసి రైతులు ఇంటికి వస్తున్నారో లేదో వర్షం పడుతుండటంతో మందు పనికి రాకుండా పోతుందని వారు ఆందోళన చెందుతున్నారు. ఆకులు ఎర్రబారటం, గూడ రాలిపోతుండడం చూసి దిగాలు చెందుతున్నారు. అధిక వర్షాల కారణంగా పెట్టిన పెట్టుబడి వస్తుందో రాదోని వేదన వ్యక్తం చేస్తున్నారు. దుక్కులు దున్నడం, విత్తనాలు, ఎరువులు, క్రిమి సంహారక మందులు, కలుపుతీత పనులతో పాటు ఇతరత్రా ఇప్పటికే అప్పులు చేసి ఎకరాకు రూ. 30 వేల వరకు పెట్టుబడి పెట్టినట్లు చెబుతున్నారు. జిల్లాలో సుమారు 3,16,171 ఎకరాల్లో పత్తి పంట సాగు చేస్తున్నారు. అధిక వర్షాల కారణంగా ఇప్పటి వరకు సుమారు అధికారుల లెక్కల ప్రకారం 70 వేల ఎకరాలలో పత్తి పంట దెబ్బతినిందని అంచనా వేస్తున్నారు. ఆరు వేల ఎకరాల్లో మాత్రమే పంట నష్టం జరిగిందని ప్రభుత్వానికి నివేదిక పంపడంపై అన్నదాతలు సంబంధిత అధికారుల తీరుపై మండిపడుతున్నారు. ఈ సారి పత్తి పంట ఆశాజనకంగా ఉంది. అధిక వర్షాలు పడిన చోట పంటను చీడపీడలు ఆశిస్తున్నాయి. పచ్చదోమ, ఎర్రనల్లి, పురుగు పత్తిని ఆశించి మొక్క అడుగు భాగం నుంచి పత్తి ఆకులపై వాలి ఆకు రసాన్ని పీల్చడంతో పత్తి ఆకులు ఎర్రబారి రాలిపోతున్నాయి. ఆకులు కింద వైపు ముడుచుకుపోవడంతో పత్తి మొక్కల ఎదుగుదల తగ్గిపూత, కాత పురుగులు, ఎర్రనల్లి రసం పీల్చడంతో గూడలు, కాయలు బలహీన పడుతున్నాయి.

గూడ, ఆకులు నిల్వడం లేదు



సొంత భూమితో పాటు మరో 12 ఎకరాలు కౌలుకు తీసుకుని పత్తి పంట సాగు చేస్తున్నా. అధిక వర్షాల కారణంగా పత్తి మొక్కలు ఏపుగా పెరిగినా పూత, గూడ కిందరాలిపోతుంది. దెబ్బతిన్న పంటలకు పరిహారం మంజూరు చేసి రైతులను ఆదుకోవాలి. – శివకుమార్ రైతు, జంబిగా గ్రామం, రాయికోడ్

నివారణ చర్యలు చేపట్టాలి



పురుగు, ఎర్రనల్లి ఆకు ముడతకు మందు పిచికారీ చేయాలి. అధిక వర్షాలకు లోతట్టు ప్రాంతాల్లో ఉన్న పత్తి పంట నీట మునిగి కాయలు పనికి రాకుండా పోతున్నాయి. పత్తి పంట దెబ్బతిన్న రైతుల వివరాలు సేకరించి నష్ట పరిహారం కోసం ప్రభుత్వానికి నివేదిక పంపిస్తాం. నష్టపరిహారం మంజూరు కాగానే రైతుల బ్యాంక్ అకౌంట్‌లో జమ చేస్తాం. – శివప్రసాద్ ,జిల్లా వ్యవసాయాధికారి


నారాయణఖేడ్: అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి


జహీరాబాద్ టౌన్: శ్రీగాయత్రిదేవిగా దర్శనమిచ్చిన అమ్మవారు

గాయత్రిదేవిగా అమ్మవారు

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు అత్యంత భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా ఆయా గ్రామాల్లోని మండపాల వద్ద ప్రతిష్ఠించిన దుర్గామాత ప్రతిమకు పూజలు చేశారు. నవరాత్రుల సందర్భంగా అమ్మవారు భక్తులకు రోజుకో రూపంలో దర్శనమిస్తారు. మంగళవారం గాయత్రిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు, అభిషేకాలు నిర్వహించి తీర్థ ప్రసాదాలను వితరణ చేశారు.


కంగ్టి: దెగుల్‌వాడిలో.. మాజీ ఎమ్మెల్యేను సన్మానిస్తున్న నిర్వాహకులు


నారాయణఖేడ్ బోరంచ నల్లపోచమ్మ ఆలయంలో..


తెల్లాపూర్ మైహోమ్ అంకురాలో..


మునిపల్లి(అందోల్): ఖమ్మంపల్లిలో..


హత్నూర: దౌల్తాబాద్‌లో..

రూ.6 కోట్లతో బాక్స్ డ్రైనేజీ పనులు

ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి


కాలనీవాసులతో మాట్లాడుతున్న మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని ముత్తంగి, ఇస్నాపూర్ మున్సిపల్ పరిధిలోని చిట్కుల్ గ్రామాల పరిధిలోని కాలనీల్లో వరదనీటి వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారంగా అతి త్వరలో రూ. 6కోట్లతో బాక్స్ డ్రైనేజ్ నిర్మాణ పనులు ప్రారంభించనున్నట్లు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. మంగళవారం ముత్తంగి పరిధిలోని పలు కాలనీల్లో ఎమ్మెల్యే పర్యటించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముత్తంగి, ఇస్నాపూర్ చెరువుల నుంచి అలుగులు పారుతూ జాతీయ రహదారి మీదుగా ప్రవహిస్తున్న నీటిని కాలనీల్లోకి వెళ్లకుండా నూతన బాక్స్ డ్రైనేజీ ద్వారా చిన్నవాగులోకి పంపించనున్నట్లు చెప్పారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా నూతన కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని వివరించారు. ఈ నెల 29న జరగనున్న బతుకమ్మ పండుగకు అన్నీ ఏర్పాట్లు చేయాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. చెరువులో పేరుకుపోయిన గుర్రపు డెక్కను రెండు రోజుల్లో తొలగించాలన్నారు. గుర్రపు డొక్క తొలగింపు యంత్రాన్ని వెంటనే పంపించాలని హెచ్ఎండీఏకు ఉన్నత అధికారులకు సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్లు వెంకట కిషన్ రావు, అజయ్ రెడ్డి, పంచాయతీరాజ్ శాఖ డీఈ సురేశ్, ఇరిగేషన్ డీఈ రామస్వామి, జాతీయ రహదారుల డీఈ రామకృష్ణ, విద్యుత్ శాఖ డీఈ తులసిరావు, నాయకులు పాల్గొన్నారు.

అల్గోల్ విద్యార్థులకు మెడికల్ సీట్లు


గౌతమ్‌కుమార్


సుజ్రన్ కుమార్


ఎండీ. ఉబేద్

జహీరాబాద్ టౌన్: ఇటీవల ప్రకటించిన నీట్(ఎంబీబీఎస్) మొదటి రౌండ్ కౌన్సిలింగ్‌లో మండలంలోని అల్గోల్ మైనార్టీ బాలుర గురుకుల ఆఫ్ ఎక్సలెన్స్ కళాశాల విద్యార్థులకు ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ఫ్రీ సీట్లు వచ్చాయని ప్రిన్సిపాల్స్ జే.రాములు, కేఎస్ జమీల్‌లు తెలిపారు. నీట్‌లో ఉత్తమ ర్యాంక్‌లు సాధించిన గౌతమ్ కన్నకు నిర్మల్ ప్రభుత్వ మెడికల్ కళాశాలలో, ప్రుజన్ కుమార్‌కు ఆసిఫాబాద్, ఎండీ.ఉబేద్‌కు నాగర్ కర్నూల్ గవర్నమెంట్ మెడికల్ కాలేజీలో ఫ్రీ సీట్లు వచ్చాయని చెప్పారు.

అమ్మ ఆశీస్సులు ప్రజలపై ఉండాలి

కాంగ్రెస్ నేత మధు ముదిరాజ్


నీలం మధు ను సన్మానించిన నిర్వాహకులు

పటాన్‌చెరు టౌన్: దుర్గమ్మ ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని కాంగ్రెస్ నేత నీలం మధు ముదిరాజ్ అన్నారు. దేవీ శరన్నవరాత్రుల ఉత్సవాలను పురస్కరించుకొని మంగళవారం ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధి చిటుకల్ గ్రామంలో అమ్మవారి మండపం వద్ద నిర్వహించిన ప్రత్యేక పూజ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లోకశాంతి కోసం దేవీ శరన్నవరాత్రులలో తొమ్మిది రోజులు తొమ్మిది రూపాలుగా అమ్మను పూజించి ఆరాధిస్తారని తెలిపారు. అనంతరం నిర్వాహకులు మధు ను సన్మానించారు.

ఎల్ఐసీ ఏజెంట్ల సంబరాలు


సంబరాలు చేసుకుంటున్న ఎల్ఐసీ ఏజెంట్లు తదితరులు

జహీరాబాద్ టౌన్: ఎల్ఐసీ ప్రీమియంపై కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ తొలగించడంతో ఏజెంట్లు పట్టణంలోని కార్యాలయం వద్ద మంగళవారం సంబరాలు చేసుకున్నారు. కేక్‌కట్ చేసి టపాసులు కాల్చారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు ఆర్.సుభాశ్, విఠల్‌గౌడ్‌లు మాట్లాడుతూ.. కేంద్రం ప్రభుత్వ తీసుకున్న నిర్ణయం వల్ల సామాన్య ప్రజలకు ప్రయోజనం కల్గుతుందన్నారు. ప్రీమియంపై జీఎస్టీ తొలగించాలని 8 సంవత్సరాల నుంచి ఉద్యమాలు చేస్తున్నామని చెప్పారు. కేంద్ర తీసుకున్న ఈ నిర్ణయం వల్ల బీమా అందరికీ చేరువ అవుతుందని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ శ్రీనివాస్‌రాజు, అసిస్టెంట్ మేనేజర్ సుధాకర్‌రావు, ఉద్యోగుల సంఘం నాయకులు శ్రీనివాస్, ఎల్ఐసీ ఏజెంట్ల సంఘం నాయకులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ


జహీరాబాద్: చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

జహీరాబాద్: ఆయా ఆస్పత్రుల్లో చికిత్స పొందిన వారికి సీఎం సహాయనిధి చెక్కులను మంగళవారం ఎమ్మెల్యే మాణిక్‌రావు పంపిణీ చేశారు.మాజీ మంత్రి ఎ.చంద్రశేఖర్ క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆత్మచైర్మన్ రామలింగారెడ్డిలు చెక్కులను పంపిణీ చేశారు. ఆయా మండలాలకు చెందిన 21 మందికి రూ.9.78 లక్షల చెక్కులను ఆత్మచైర్మన్ రామలింగా రెడ్డి అందజేశారు.

రూ.57 లక్షల విలువైన చెక్కుల పంపిణీ

పటాన్‌చెరు టౌన్: పేద మధ్యతరగతి ప్రజలకు మెరుగైన వైద్య చికిత్స అందించడంలో ముఖ్యమంత్రి సహాయ నిధి అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని వివిధ గ్రామాలు, మున్సిపాలిటీలు, డివిజన్‌లకు సంబంధించిన 125 మంది లబ్ధిదారులకు చెక్కులను మంజూరైన 57 లక్షల 74 వేల రూపాయల విలువైన చెక్కులను ఎమ్మెల్యే లబ్ధిదారులకు అందజేశారు.

రూ.12 లక్షల చెక్కులు అందజేత

నారాయణఖేడ్: నియోజకవర్గ పరిధికి చెందిన 33 మందికి ఆస్పత్రి ఖర్చుల కోసం ఎంపీ సురేష్ షెట్కార్ సిఫార్సు మేరకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా రూ.12 లక్షల విలువగల చెక్కులు మంజూరయ్యారు.

ఝరాసంగం మండలంలో..

ఝరాసంగం(జహీరాబాద్): సీఎం సహాయనిధి ద్వారా మంజూరైన చెక్కులను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు హన్మంత్‌రావు పాటిల్ లబ్ధిదారులకు మంగళవారం అందజేశారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన భీంసింగ్, పెద్దదొడ్ల నర్సన్న రూ.60వేలు చొప్పున, ఖాండ్ పాషాకు రూ.40వేల చెక్కులను అందించారు.

రూ. 57లక్షల విలువైన చెక్కులు అందజేత

పటాన్‌చెరు టౌన్: పేద మధ్యతరగతి ప్రజలకు మెరుగైన వైద్య చికిత్స అందించడంలో ముఖ్యమంత్రి సహాయనిధి అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. పటాన్‌చెరు నియోజకవర్గ పరిధిలోని వివిధ గ్రామాలు, మున్సిపాలిటీలు, డివిజన్‌లకు సంబంధించిన 125 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన 57 లక్షల 74 వేల రూపాయల విలువైన చెక్కులను ఎమ్మెల్యే లబ్ధిదారులకు అందజేశారు.

వరిలో కాంప్లెక్స్ ఎరువులు వాడొద్దు


అగ్గితెగులు పరిశీలిస్తున్న ఏడీఏ నూతన్‌కుమార్‌తో ఏఓ, ఏఈఓలు

కంగ్టి(నారాయణఖేడ్): వరి పంటలో పైపాటుగా కాంప్లెక్స్ ఎరువులు వాడవద్దని నారాయణఖేడ్ ఏడీఏ నూతన్‌కుమార్ తెలిపారు. మంగళవారం మండలంలోని తడ్కల్ శివారులోని వరి పంటపొలాలను ఏఓ హరీష్‌పవార్‌తో కలిసి సందర్శించారు. రైతులు వరి పంటకు రోగాలు వస్తున్నాయని ఫిర్యాదు చేయడంతో పరిశీలిస్తూ.. పై పాటుగా 20:20:0:13 ఎరువు ఎట్టి పరిస్థితుల్లో వేయరాదన్నారు. ఎకరాకు 25 కిలోల చొప్పున నాలుగు దఫాలుగా వేసుకోవాలని సూచించారు. వరిలో అగ్గితెగులు, బ్యాక్టిరియా ఎండుతెగులు సోకినట్లు తెలిపారు. యూరియా ద్రవం ఎకరాకు 500 మిల్లీలీటర్లు వాడిన ప్రతీసారి పిచికారీ చేయాలని సూచించారు. అగ్గితెగులు, బ్యాక్టీరియా ఎండు తెగులు నివారణకు ట్రైసైక్లోజెల్, మాంకోజెబ్ కలిపిన ద్రావణం ఉదయం వేళల్లో పిచికారీ చేయాలి. దీంతో పాటు అగ్రిమైసిన్ గాని ప్లాంటోమైసిన్ గాని కలిపి పిచికారీ చేయాలని సూచించారు. వారితో పాటు ఏఈఓలు భార్గవ్, హన్మండ్లు, నాగేందర్ పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలి



ధర్నా చేస్తున్న నాయకులు, కార్మికులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం పట్టణంలోని ఈఎస్ఐ ఆసుపత్రిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులకు పెండింగ్‌లు వేతనాలను వెంటనే చెల్లించాలని జిల్లా సీఐటీయూ నాయకులు నాయిని నర్సింహారెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం రామచంద్రాపురం పట్టణంలోని ఈఎస్ఐ ఆసుపత్రి ఎదుట కాంట్రాక్ట్ కార్మికులు ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చాలీచాలని వేతనాలతో జీవనం సాగిస్తున్న కార్మికులకు నెల నెల వేతనాలు ఇవ్వకుండా శ్రమదోపిడీ చేస్తున్నారని మండిపడ్డారు. కాంట్రాక్టర్లకు బిల్లులు వచ్చిన రాకపోయినా కాంట్రాక్ట్ కార్మికులకు వేతనాలు ఇవ్వాలన్నారు. దసరా పండుగను దృష్టిలో పెట్టుకొని రెండు రోజుల్లో పెండింగ్ వేతనాలు చెల్లించని పక్షంలో సీఐటీయూ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు సురేష్, యాదయ్య, లోకసాథ్, సంతోష, పోచమ్మ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

హైవే విస్తరణ పనులు అడ్డగింత


కాంట్రాక్టర్‌తో వాగ్వాదం చేస్తున్న కాలనీవాసులు

సంగారెడ్డి: 165 హైవే విస్తరణలో భాగంగా రోడ్డు కిరువైపులా ఉన్న దుకాణ సముదాయాలను తొలగిస్తూ విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేస్తున్న కాంట్రాక్టర్‌ను పోతిరెడ్డిపల్లి గ్రామస్తులు, దుకాణాల యజమానులు నిలదీసి పనులు ఆపారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ.. హైవే అథారిటీ డీఈఈ రామకష్ణ కాంట్రాక్టర్‌తో కుమ్మక్కై వన్‌సైడ్ ఉన్నవారికే నష్టం కలిగిస్తూ రోడ్డుకు మరో వైపు ఉన్న వారికి లాభం కలిగేలా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వానికి, హైవే అథారిటీ అధికారులకు తప్పుడు నివేదికలు ఇస్తూ రోడ్డు పనులను కొనసాగిస్తున్నారని మండిపడ్డారు. 1992లో గ్రామపంచాయతీ పర్మిషన్ తీసుకొని నిర్మించుకున్న వాటిని తొలగిస్తూ తమకు తీరని నష్టం కలిగిస్తున్నారన్నారు. రోడ్డు సెంటర్ నుంచి రెండు వైపులా 100 ఫీట్లు తీసుకోవాలని కోర్టు ఆర్డర్ ఇచ్చినప్పటికీ కోర్ట్ ఆర్డర్‌ను ధిక్కరించి ఒకవైపు 85 ఫీట్లకు పరిమితం చేసి మరోవైపు 115 ఫీట్లు వెడల్పును చేస్తూ తమకు నష్టం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రూ.1298 కోట్లతో చేస్తున్న ఈ పనుల్లో నాణ్యత కరువైందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రోడ్డు వెడల్పులు న్యాయబద్ధంగా వేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

సంక్షిప్త వార్తలు

◆ బాధితుడికి ఆర్థిక సహాయం

జహీరాబాద్ టౌన్: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స కోసం బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తట్టునారాయణ రూ.50 వేల ఆర్థిక సహాయం అందజేశారు. మండలంలోని ఆనేగుంటకు చెందిన కడమంచి కిషోర్ బూచినెల్లి గ్రామ పరిధిలో మోటారు బైక్ నుంచి అదుపుతప్పి కిందపడ్డాడు. తీవ్ర గాయాలు కావడంతో సంగారెడ్డిలోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకుని ఆయన మంగళవారం ఆసుపత్రికి వెళ్లి ఆర్థిక సహాయం అందించారు. నారాయణకు కిషోర్ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ జగదీశ్, తట్టు విశ్వనాథ్ తదితరులు ఉన్నారు.

◆ మందుబాబులకు జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుపడిన వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ కథనం ప్రకారం.. సోమవారం నిర్వహించిన తనిఖీల్లో 9 మందిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. వారిని మంగళవారం కోర్టులో హాజరు పరచగా ఐదుగురికి ఒక్కొక్కరికి రూ. వెయ్యి, ముగ్గురికి రూ.1500, మరో వ్యక్తికి రూ.2 వేల చొప్పున జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

◆ ఘనంగా బతుకమ్మ సంబరాలు

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని వశిష్ఠ డిగ్రీ కళాశాలలో మంగళవారం బతకమ్మ వేడుకలు ఘనంగా జరుపుకొన్నారు. అటవీశాఖ అధికారిణి కృష్ణమ్మ ప్రిన్సిపాల్ డాక్టర్ సిద్దారెడ్డి పూజలు నిర్వహించారు. అనంతరం కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు ఆడిపాడారు. ఈ సందర్భంగా అటవీశాఖ అధికారిణి మాట్లాడుతూ.. తెలంగాణ సంస్కృతికి నిలువుటద్దం బతుకమ్మ పండగన్నారు. వందల సంవత్సరాలుగా ప్రజలు భక్తిశ్రద్ధలతో వేడుకలను జరుపుకొంటున్నారని అన్నారు. అందరిని చల్లంగా చూడాలని వేడుకున్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సిద్దారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ మారుతిరావు, కళాశాల డైరెక్టర్లు అమర్‌నాథ్, శంకర్‌రావు, సంజీవ్‌రావు అధ్యాపకులు పాల్గొన్నారు.

◆ పిల్లల ఈత సరదా

కంగ్టి(నారాయణఖేడ్): నిత్యం కురుస్తున్న వర్షాలకు అలుగులు మత్తడి దూకుతున్నాయి. దీంతో పిల్లలు ఈత కొడుతూ.. అలుగుపై నుంచి నీటిలోకి దూకుతూ సరదాగా గడుపుతున్నారు. కంగ్టి మండలంలోని బాన్సువాడ గ్రామం వద్ద కాకివాగులో నిర్మించిన చెక్‌డ్యాంలో ఈత కొడుతూ పిల్లలు సందడి చేస్తున్నారు. మధ్యాహ్నం కాగానే పదుల సంఖ్యలో పిల్లలు ఉల్లాసంగా.. ఉత్సాహంగా ఈత కొట్టడం పక్క నుంచి వెళ్తున్న ప్రయాణికులు సంతోషంగా తిలకిస్తున్నారు.

◆ ఉచితవైద్య శిబిరంతో ప్రయోజనం

సదాశివపేట(సంగారెడ్డి): విస్డం రైజింగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని శివపూరి కాలనీలో ఆద్య మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి సహకారంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో షుగర్, బీపీ, వైరల్ ఫీవర్ వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందజేశారు. వైద్య శిబిరానికి హాజరైన వారందరికి వర్షాకాలంలో పరిశుభ్రతను పాటించాలని వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. కాచి చల్లార్చిన నీరు తాగాలని వైద్యులు సూచించారు, ఉచిత వైద్య శిబిరంలో వైద్యులు హరీశ్‌రెడ్డి, భరత్ అభినవ్‌రెడ్డి పాల్గొని వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో విస్డం రైజింగ్ ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

◆ అంతరాష్ట్ర భజన పోటీలు ప్రారంభం

జహీరాబాద్ టౌన్: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని భవానీ మందిరంలో అంతరాష్ట్ర భజన పోటీలు మంగళవారం రాత్రి ప్రారంభమైయ్యాయి. గత కొన్ని సంవత్సరాల నుంచి ప్రతి ఏటా పెద్ద ఎత్తున భజన పోటీలు నిర్వహిస్తుండగా తెలంగాణ, మహారాష్ట్ర, కర్నాటక రాష్ట్రాల నుంచి భజన మండళ్లు పాల్గొంటాయి. ఈ సంవత్సరం కూడా భజనపోటీలు నిర్వహించేందుకు నిర్వాహకులు ర్పాట్లు చేసినట్లు భవానీ భజన మండలి అధ్యక్షుడు శివకుమార్ పాటిల్ తెలిపారు. ఈ నెల 28 వరకు పోటీలు కొనసాగుతుండగా విజేతలకు నగదు బహుమతులు అందజేయనున్నట్లు చెప్పారు.